andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.7; కనిష్ఠం 28.2
నిర్మల్
జిల్లా వార్తలు
8
ఆదివారం 7 ఏప్రిల్ 2024



ఐదు కిలోల బరువుతో మగ శిశువు జననం



నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 6 : నిర్మల్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో శుక్రవారం రాత్రి ఐదు కిలోల బరువుతో ఓ మహిళ మగశిశువుకు జన్మనిచ్చిందని హెచ్‌వోడీ డాక్టర్ సరోజ, సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ రజని తెలిపారు. సారంగాపూర్ మండలం ఆలూర్ గ్రామానికి చెందిన స్రవంతి రెండో కాన్పులో 4 కిలోల 900 గ్రాముల బరువుతో మగబిడ్డను కన్నది. సాధారణ ప్రసవం జరిగిందని వైద్యులు తెలిపారు.



కబ్జాలపై కొరడా



సాకెర గ్రామ సమీపంలో బోర్డు ఏర్పాటు చేసిన ఇరిగేషన్ అధికారులు

- జిల్లాలో అడ్డగోలుగా భూకబ్జాలు
- నాటి ఫిర్యాదుల చిట్టా దులుపుతున్న కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు
- ఆక్రమణకు గురైన భూములను గుర్తించి వాటిలో హెచ్చరిక బోర్డులు
- భూముల రక్షణకు పకడ్బందీ చర్యలు
- అప్పటి నేతలకు వరంగా మారిన ధరణి పోర్టల్
- వెంటనే చర్యలు చేపట్టాలంటూ డిమాండ్

నిర్మల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : గత కొంతకాలం నుంచి అప్పటి నేతలు సాగించిన భూకబ్జాల దందాపై జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అధికార యంత్రాంగం కొరడా ఝులిపిస్తోంది. చెరువులు, కుంటల జాగాలతో పాటు డీ -1 పట్టాల పేరిట సర్కారు భూములు స్వాహా అలాగే సొసైటీ భూముల కబ్జాలపై కలెక్టర్ గత రెండు నెలల నుంచి పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తున్నారు. దీంతో పాటు స్థానిక సోఫీనగర్‌లోని డీమార్ట్ స్థలంపై కూడా కలెక్టర్ విచారణ జరిపారు. ఈ విచారణ ఆధారంగా ఆయన పూర్తిస్థాయిలో నివేదికలు రూపొందించి ఒక్కొక్క అక్రమంపై చర్యలకు శ్రీకారం చుట్టారు. కొంతమంది నేతలు జిల్లా కేంద్రమైన నిర్మల్ పట్టణంలో గల పలు విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై కలెక్టర్ విచారణ జరిపి ఇటీవలే భూములను స్వాధీనం చేసుకునే చర్యలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే సోఫీనగర్‌లోని సాకెర గ్రామం వెళ్లే మార్గంలో గల ఓ నీటి కుంట భూమిని కబ్జాచెర నుంచి విడిపించారు. ఈ భూమి ఇరిగేషన్ శాఖకు చెందినప్పటికీ కొంతమంది రాజకీయ నేతలు రియల్టర్లతో కలిసి ఈ భూమిపై కన్నేశారు. ఈ భూమిని చదును చేసి ప్లాట్లు చేసేందుకు అన్ని రకాల ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే దీనిపై కొంతమంది కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న ఇరిగేషన్ శాఖ అధికారులు ఎట్టకేలకు మేలుకొని రెవెన్యూ సర్వే డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు ఆ భూమిలో ఇది తమ భూమి అంటూ బోర్డు పాతిపెట్టారు.



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు (ఫైల్)

అలాగే పట్టణ నడిబొడ్డున గల శాంతినగర్‌లోని ఎఫ్‌ఎస్‌సీఎస్ (రైతుసేవా సహకారం) సంఘకు సంబంధించిన దాదాపు ఎకరం భూమిని కూడా సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నిర్మించిన షెడ్లను కూడా తొలగించారు. ఈ భూములను కొంతమంది సీనియర్ నాయకులు పథకం ప్రకారం తప్పుడు డాక్యుమెంట్లతో కబ్జా చేసినట్లు అధికారులు నిర్ధారించారు. దీంతో పాటు జిల్లాలో దాదాపు 300లకు పైగా నకిలీ డి-1 పట్టాల పేరిట వెయ్యి ఎకరాలకు పైగా పట్టా భూములు స్వాహా అయినట్లు గుర్తించారు. ఈ ఆరోపణల ఆధారంగా జిల్లా కలెక్టర్ మొత్తం డి-1 పట్టా భూములపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపించారు. రికార్డులన్నింటిని పరిశీలించేందుకు ఇద్దరు అధికారులను సైతం ఆయన ప్రత్యేకంగా నియమించి నివేదికలు రూపొందించారు. ఈ నివేదికల ఆధారంగా నేడో రేపో చర్యలు తీసుకునేందుకు కలెక్టర్ సిద్ధమవుతున్నారు.

చెరువులు, కుంటల భూములు మాయం..

జిల్లా కేంద్రంతో పాటు మరికొన్ని గ్రామాల్లో చెరువు భూములు పెద్ద ఎత్తున కబ్జాలకు గురయ్యాయి. శిఖం, బఫర్‌జోన్ పరిధిలో ఈ భూ ఆక్రమణలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. చారిత్రక గొలుసుకట్టు చెరువు భూములకు సంబంధించిన రికార్డులను కూడా తారుమారు చేసి వాటిని పట్టాభూములుగా రికార్డులు సృష్టించారని చెబుతున్నారు. శిఖం భూముల పక్కన ఉన్న పట్టా భూములకు సంబంధించిన సర్వేనంబర్‌లకు బై నంబర్లు వేసి ఆ భూములను కబ్జా చేశారన్న ఫిర్యాదులున్నాయి. ముఖ్యంగా ధర్మాసాగర్ చెరువు, కంచరోణి చెరువు అలాగే ఇబ్రహీం చెరువుతో పాటు మంజులాపూర్ చెరువు భూములను అప్పటి కొంతమంది నాయకులు వారి అనుచరులు బినామీల పేరిట ఆక్రమించారన్న విమర్శలున్నాయి. ఈ ఫిర్యాదులపై స్పందించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ చెరువు భూములపై ఆరా తీస్తున్నారు. దీనికి అనుగుణంగానే ఇప్పటికే చెరువు భూముల సరిహద్దులను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. గతంలో కూడా పలు చెరువు భూములకు అధికారులు పెన్సింగ్‌లు ఏర్పాటు చేసినప్పటికి అప్పటి కొంతమంది నాయకులు ఆ పెన్సింగ్‌లను తొలగించి ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగించారన్న విమర్శలున్నాయి.

అప్పట్లో ఫిర్యాదులన్నీ బేఖాతరు..

కాగా అప్పట్లో తమ పార్టీ అధికారంలో ఉన్నంతకాలం ఆ పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమకు అనుకూలమైన అధికారులను బదిలీ, డిప్యూటేషన్‌లపై ఇక్కడికి తీసుకువచ్చి ఈ భూముల దందాకు తెర లేపారన్న విమర్శలున్నాయి. అప్పటి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన కొంతమంది అధికారులు రికార్డులను సైతం తారుమారు చేశారంటున్నారు. అసైన్డ్ భూములకు కూడా పట్టాలు జారీ చేశారని అలాగే శిఖం భూములు, దేవాదాయ శాఖ భూముల రికార్డులను సైతం తారుమారు చేశారని చెబుతున్నారు. ముఖ్యంగా ధరణి కారణంగా పెద్ద ఎత్తున రికార్డుల తారుమారు జరిగిందంటున్నారు. ధరణి పోర్టల్ అప్పటి నేతలకు ఓ వరంగా మారిందని అయితే ప్రస్తుత జిల్లా కలెక్టర్ అప్పటి ధరణి ఆచరణలో జరిగిన భూముల లావాదేవీలపై కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

వెంటనే చర్యలు చేపట్టాలంటూ డిమాండ్..

కాగా ప్రభుత్వ భూముల ఆక్రమణలు, నకిలీ డి-1 పట్టాలతో భూముల ఆక్రమణలను గుర్తిస్తున్న అధికార యంత్రాంగం ఈ ఆక్రమణల సూత్రధారులపై చర్యలు తీసుకోవడంలో ఇప్పటి వరకు కఠినంగా వ్యవహరించడం లేదంటున్నారు. ఆక్రమణకు గురైన స్థలాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుంటున్నప్పటికి ఈ అక్రమాలకు పాల్పడిన అసలు సూత్రధారులపై ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో విచారణ జరగకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులపై రాజకీయ ఒత్తిళ్లు పెరుగుతున్న కారణంగానే కఠిన చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోందంటున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు ఈ దిశగా ప్రత్యేక దృష్టి సారించి ఆక్రమణల సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకున్నట్లయితేనే ప్రజల్లో యంత్రాంగంపై విశ్వాసం పెరుగుతోందని అంటున్నారు. లేనట్లయితే గతంలో మాదిరిగానే యథావిధిగా రాజకీయ ఒత్తిళ్ళ యంత్రాంగంపై పకడ్బందీగా పని చేస్తున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యే అవకాశం ఉందంటున్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన



ముథోల్ ఎమ్మెల్యే రాంరావును స్వామి వారి శేషవస్త్రంతో ఆశీర్వదిస్తున్న దృశ్యం

ముథోల్, ఏప్రిల్ 6 : ముథోల్ మండలం బోరేగాం గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గంగాప్రసాద్ స్వామి స్వహస్తాల మీదుగా హోమం తదితర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నందిపేట్ పలుగుట్ట మంగి రాములు మహరాజ్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ నాయకులు మోహన్‌రావు పటేల్, తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, ఎంపీటీసీ జ్యోతి దేవన్న, కేశన్న, మురళి, లక్ష్మణ్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకొని పనిచేయండి : డీఆర్డీవో విజయలక్ష్మి



ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న విజయలక్ష్మి

లక్ష్మణచాంద, ఏప్రిల్ 6 : ఆరోగ్యాన్ని కాపాడుకొని పని చేయాలని డీఆర్డీవో విజయలక్ష్మి శనివారం అన్నారు. మండలంలోని రాచాపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు తగు సూచనలు చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఏపీవో ప్రమీల, టెక్నికల్ సిబ్బంది ఉన్నారు.

జన జాతర సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



తరలివెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 6 : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో కాంగ్రెస్ పార్టీ శనివారం నిర్వహిస్తున్న జన జాతర సభకు నిర్మల్ నుంచి పెద్ద ఎత్తున శ్రేణులు తరలివెళ్లారు. డీసీసీ అధ్యక్షుడు కే.శ్రీహరిరావు నేతృత్వంలో మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరారు. పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను అగ్రనేతలు మల్లికార్జున్‌ఖర్గే, రాహుల్‌గాంధీ, రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికలపైన దిశానిర్దేశం చేయనున్నారని శ్రీహరిరావు తెలిపారు.

లక్ష్మణచాంద నాయకులు..

లక్ష్మణచాంద, ఏప్రిల్ 6 : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో గల రాజీవ్ గాంధీ ప్రాంగణంలో శనివారం నిర్వహింబడిన 'తెలంగాణ జన జాతర' సభకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. సభకు వెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పేరుతో లక్షల ఎకరాల భూమి మాయం

● బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 6 : రాష్ట్రంలో లక్షల ఎకరాల భూమి ధరణి పేరుతో మాయమైందని బీజేఎల్పీ నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం పోరాటం చేస్తామన్నారు. జిల్లాలో డి-1 పట్టాల పేరుతో భూములు మాయమయ్యాయని స్పష్టం చేశారు. రికార్డులను తారుమారు చేసి దొంగ పట్టాలు పంపిణీ చేశారని ధ్వజమెత్తారు. పట్టణంలోని డీ మార్ట్ ప్రాంతం నాలుగు ఎకరాల 29 గుంటలు చరాయి భూమి అని తెలిపారు. మంత్రులు ఆదేశాలిచ్చినా అధికారులు స్పందించకుండా వ్యాపారులకు మేలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మారినా పాలనలో మార్పు లేదన్నారు. గత ప్రభుత్వాన్ని తలపిస్తోందని, అభివృద్ధి ఎక్కడవేసి గొంగళి అక్కడే అన్నట్టుగా ఉందన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని, అబద్ధపు హామీలతో రైతులు, నిరుద్యోగులను మోసం చేస్తున్నారని విమర్శించారు.

భారీ మెజార్టీ లక్ష్యంగా పార్టీ శ్రేణులు పాటుపడాలి

● బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ పాయల శంకర్



భైంసాలో జరిగిన పార్టీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ పాయల శంకర్

భైంసా, ఏప్రిల్ 6 : ప్రస్తుతం నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల్లో ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడం ఖాయమని అయితే భారీ మెజార్టీని లక్ష్యంగా పెట్టుకొని పార్టీ శ్రేణులు పాటుపడాలని ఆ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ పాయల శంకర్ పిలుపునిచ్చారు. శనివారం భైంసాలో జరిగిన ముథోల్ నియోజక బీజేపీ ప్రధాన ప్రతినిధులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీని, కల్లబొల్లి కబుర్లతో దశాబ్దకాలంగా రాష్టాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మె పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్ని వర్గాల ప్రజానీకానికి ప్రత్యామ్నాయం బీజేపీ పార్టీయేనని వెల్లడించారు. దీనికి తోడు దశాబ్దకాలంగా ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వ సాధించిన ప్రగతి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలను అందివ్వడం మూలంగా అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపే దృష్టి సారించాయన్నారు. ముచ్చటగా మూడోసారి ప్రధానిగా నరేంద్రమోదీని చూడాలని దేశం అకాంక్షిస్తోందన్నారు. పార్టీ శ్రేణులు, ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ప్రణాళికబద్ధమైన విధానాలతో, పకడ్బందీ చర్యలతో ఆదిలాబాద్ లోక్‌సభ స్థాన పరిధిలో భారీ మెజార్టీతో పార్టీ అభ్యర్థి గెడం నగేష్‌ను గెలిపించేందుకు కంకణబద్దులు కావాలని పిలుపునిచ్చారు. ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ మాట్లాడుతూ మోసపూరిత విధానాలతో పాలన కొనసాగించిన కేసీఅర్ సర్కార్‌కు నియోజకవర్గ ప్రజానీకం అసెంబ్లీ ఎన్నికల్లో తగురీతిలో గుణపాఠం నేర్పిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో నయవంచన పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ సర్కార్ గుణపాఠం నేర్పి బీజేపీకి పూర్తిస్థాయి అధిక్యతను అందిస్తారని వెల్లడించారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి



కుంటాల మండలంలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల, ఏప్రిల్, 6 : రాబోయే వర్షాకాలంలో హరితహరం పథకం ద్వారా నాటేందుకు ఆయా గ్రామాలలో నర్సరీల పెంపకం చేపడుతున్న మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రం కుంటాల, ఓలాతో పాటు ఆయా గ్రామాలలో నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మొక్కల పెంపకం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని నాటిన ప్రతి మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఈయన వెంట ఎంపీడీవో రహీం, ఏపీవో నవీన్, సిబ్బంది ఉన్నారు.

బీటీ రణదీవే ఆశయాలను కొనసాగిద్దాం

34వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళిలో వక్తలు

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 6 : కార్మిక ఉద్యమనేత సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు కామ్రేడ్ బీటీ రణదీవే 34వ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వారి జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ.. బీటీఆర్ ఒక గొప్ప సిద్ధాంతవేత్త, ఆలోచనపరుడు, మేధావి, పోరాటయోధుడు మార్క్సిజం లేని నిజం వంట బుచ్చుకొని కార్మిక పోరాటాలను ఉధృతం చేసిన మహా గొప్ప మేధావి అన్నారు. శ్రామిక మహిళలను సంఘటితం చేయడంలో మనలో ఉన్న అవలక్షణాలను పురుషాధిక్యత సమాజం ఫీడల్ భావజాలానికి వ్యతిరేకంగా స్త్రీలను చిన్నచూపు చూపిన పోరాటం చేసి కార్మికవర్గాన్ని ఐక్యం చేసి దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప నాయకుడన్నారు. కార్మిక హక్కుల కోసం, కనీస వేతనాల కోసం పోరాటం చేసిన ఒక గొప్ప సంఘ కర్త అన్నారు. ఈ పది సంవత్సరాల కాలంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను తిరుగదోడుతూ కార్మిక పొట్టలు కొట్టే విధంగా బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కార్మిక వర్గం అంతా కలిసి ఓడించి బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు డి.పోశెట్టి, ఆశావర్కర్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు సుజాత, డివిజన్ కార్యదర్శి కమల, నిర్మల్ డివిజన్ నాయకులు సుగుణ, ముథోల్ డివిజన్ అధ్యక్షులు ఇంద్రమాల, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య



నక్కవాడు మాధవరావు మృతదేహం

భైంసా రూరల్, ఏప్రిల్ 6 : మండలంలోని కుంసర గ్రామానికి చెందిన నక్కవాడు మాధవరావు శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నక్కవాడు మాధవరావు(55) గత కొద్ది రోజుల నుంచి మద్యానికి బానిసై ఇంటివారితో ప్రతీరోజు గొడవ పడేవాడు. మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు నక్కవాడు పవన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏసీ కాలిపోయి చెలరేగిన మంటలు

పరుగులు తీసిన రోగులు



ఆసుపత్రిలో చెలరేగిన మంటలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 6 : నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాల, జనరల్ ఆసుపత్రిలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఏసీ కాలిపోయి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఏసీలో ఉన్న గ్యాస్ ట్యాంకు పేలడంతో రెండు మీటర్ల మేర మంటలు చోటు చేసుకున్నాయి. ఆసుపత్రిలోని రోగులు భయంతో పరుగులు తీశారు. ఆసుపత్రి సిబ్బంది అప్రమత్తమై కార్బన్ డయాక్సైడ్ స్ప్రే చేశారు. ఎలాంటి ప్రాణాపాయం చోటుచేసుకోపోవడంతో ఆసుపత్రి వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.

ఉగాది సంబరాలకు ఏర్పాట్లు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 6 : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రియదర్శినినగర్ లయన్స్‌క్లబ్‌లో ఉగాది సంబురాలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కవులు, రచయితలు హాజరుకావాలని, తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

‘రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి’

నిర్మల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆచరణ సాధ్యం కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి హామీలను నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని బీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సక్కు విమర్శించారు. బీఆర్ఎస్ అధిష్ఠానం ఇచ్చిన పిలుపు మేరకు శనివారం నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఆ పార్టీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

వామ్మో ఇవేం ఎండలు!!

● అర్లి(టి)లో 42.4 డిగ్రీల అత్యధిక పగటి ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోవడంతో ఇవేం ఎండలు బాబోయ్ అంటూ జనం బెంబెలెత్తి పోతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఎండల తీవ్రత కనిపిస్తుందంటూ అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రాబోయే మేలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని చెబుతున్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 41.3 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 23.7 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే నేరడిగొండ మండలంలో 42.1, బేల మండలంలో 41.8, ఆదిలాబాద్‌రూరల్ మండలంలో 41.0, ఆదిలాబాద్ అర్బన్‌లో 40.9, గుడిహత్నూర్ మండలంలో 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే దాదాపుగా పలుచోట్ల 40డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదు కాగా తాంసి, బోథ్, గాదిగూడ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్ మండలాల్లో 40 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు కనిపిస్తున్నాయి. పగలంతా వడగాలులతో బయటకు వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. ఎండ తీవ్రతకు వ్యవసాయ పనులు కూడా ముందుకు సాగడం లేదు. ఉదయం, సాయంత్రం వేలల్లోనే పనులు ముగించుకుని రైతులు ఇంటికి తిరుగుముఖం పడుతున్నారు. ఇప్పటికే గిరిజన ప్రాంతాల్లో తాగు, సాగునీటి ఎద్దడి తలెత్తడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



సాయిబాబా ఆలయంలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

అంగరంగ వైభవంగా ఆలయ వార్షికోత్సవం

తాంసి, ఏప్రిల్ 6: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ 4వ వార్షికోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం శనివారం ముగిసింది. తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం జరిగింది. ముందుగా వేద పండితులు ఆలయ ప్రాంగణంలో మహాయజ్ఞం నిర్వహించారు. అనంతరం ఊరేగింపు నిర్వహించి తెల్లవారుజామున 5 గంటల నుంచి అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు. గ్రామం నుంచే కాకుండా చుట్టుపక్కల ఊర్లతో పాటు పక్కన ఉన్న భీంపూర్, తలమడుగు, ఆదిలాబాద్, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కూడా వందలాది మంది భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రతీఒక్కరిని అగ్నిగుండ ప్రవేశం చేయించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. వీటిలో వస్తువులను కొనుగోలు చేసేందుకు ప్రజలు బారులు తీరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాళ్ల అశోక్‌రెడ్డి, మంత్రి నర్సారెడ్డి, ఉపేందర్, కిషన్, పెద్దసంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపునకు సిద్ధమవుతున్న రథం

బోథ్, ఏప్రిల్ 6: మండలంలోని కౌటా(బి) గ్రామంలో జరగనున్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవానికి ఈసారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అందుకు గాను భక్తులు రథాన్ని చేయిస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని అనంతపేటలోని విశ్వబ్రాహ్మణ కళాకారులు ఎర్రన్న వెంకటరమణలు తయారు చేయడం జరిగింది. త్వరలోనే రథాన్ని కౌటా(బి) గ్రామానికి తీసుకురానున్నట్లు వీరబ్రహ్మేంద్రస్వామి భక్తులు తెలిపారు.

జన జాతర సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముఖడే ఉత్తం ఆధ్వర్యంలో శనివారం తక్కుగూడలో నిర్వహించిన జన జాతర సభకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమోరే నాగోరావు, మెస్రం నాగనాథ్, సూర్యవంశీ, గణేష్, మధుకర్, తదితరులు ఉన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న బెల్గావ్ గ్రామ ప్రజలు

'బెల్గావ్ గ్రామంలో నూతన ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలి'

జైనథ్ రూరల్, ఏప్రిల్ 6: జైనథ్ మండలంలోని బెల్గావ్ గ్రామంలో జాతీయ రహదారి విస్తరణలో ప్రభుత్వ పాఠశాల ప్రహరీగోడ కోల్పోతున్న క్రమంలో బెల్గావ్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మరోచోట నిర్మించాలని బెల్గావ్ గ్రామపెద్దల అడ్డి పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం జాతీయ రహదారి నిర్మాణంలో పాఠశాల ప్రహరిని కోల్పోవడంతో విద్యార్థులకు రాబోయే రోజుల్లో తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని బెల్గావ్ గ్రామ ప్రజలు ఎంపీడీవో రవీంద్రనాథ్, ఎంఈవో జి.శ్రీనివాస్‌లకు లిఖితపూర్వకంగా జైనథ్‌రైతు వేదిక సమావేశ మందిరంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేల మండలంలోని ఉపసానాల నుంచి బోరజ్ వరకు టూ వే జాతీయ నిర్మాణం జరగబోతుందన్నారు. దీంతో బెల్గావ్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా స్థలాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ పాఠశాలను నిర్మించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్గావ్ గ్రామ ఐక్య సంఘం అధ్యక్షుడు చంద్రకళ, పాఠశాల హెచ్‌ఎం నాందేవ్‌లతో పాటు బెల్గావ్ గ్రామ ప్రజలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుంకిడి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

● ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

తలమడుగు, ఏప్రిల్ 6: మండలంలోని సుంకిడి స్టోన్ క్రషర్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. తలమడుగు ఎస్సై ధనశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సుంకిడి అంతరాష్ట్ర రహదారి స్టోన్ క్రషర్ సమీపంలో ఉదయం 9.15 గంటలకు మహారాష్ట్ర పిప్పల్‌గావ్ గ్రామానికి చెందిన గుర్నులే అంకుష్, బెండారేగోపాల్, గుర్నులే ఈశ్వర్ అనే వ్యక్తులు (ఎంహెచ్26 బీఎస్ 6732) ద్విచక్ర వాహనంపై పిప్పల్‌గావ్ నుంచి సుంకిడి గ్రామానికి వస్తున్నారు. ఇదేక్రమంలో మార్గమధ్యలో షఫి క్రషర్ దగ్గర రోడ్డు మీద తమకు ఎదురుగా మహారాష్ట్ర వైపుగా వెళ్తున్న మ్యాక్స్ (ఎంహెచ్29బీఈ6441) వాహనాన్ని నడుపుతున్న శంబెడే సంజయ్ తన వాహనాన్ని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో అంకుష్, గోపాల్, ఈశ్వర్‌లకు కుడికాలిపై రక్తపు గాయాలయ్యాయి. కాగా బెండారే గోపాల్‌ను రిమ్స్ ఆసుపత్రికి తీసుకొని వెళ్లే లోపు మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

● ఆదిలాబాద్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే పాయల శంకర్ ● జిల్లావ్యాప్తంగా అంబరాన్నంటిన సంబురాలు ● పాల్గొన్న ఎంపీ అభ్యర్థి గోడం నగేష్, నాయకులు, కార్యకర్తలు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 6: మహానుభావుల నేతృత్వంలో పని చేయడం నా అదృష్టమని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1950లో భారతీయ జన సంఘ్‌పేరుతో ప్రారంభమై 1980లో బీజేపీగా రూపాంతరం చెంది నేడు ప్రపంచాన్ని శాసించే ప్రభుత్వాన్ని ఏర్పరిచిన ఘనత బీజేపీదే అన్నారు. ప్రపంచ ప్రజాస్వామిక దేశాల్లో అతి పెద్ద రాజకీయ పార్టీగా నేడు బీజేపీ ఆవిర్భవించిందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు నరేంద్రమోదీ నాయకత్వంలో అభివృద్ధి పథంలో నడవడానికి వేచి ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరచకాలను చూసి సహించలేక కొందరు మహానుభావులు బీజేపీని స్థాపించారని గుర్తు చేశారు. బీజేపీ కార్యకర్తలు దేశ సరిహద్దుల్లో ఉన్న సైనికులతో సమానంగా దేశం కోసం ధర్మం కోసం పని చేస్తున్నారని తెలిపారు. క్రమశిక్షణకు నిబద్ధతకు దేశ భక్తికి బీజేపీ కార్యకర్తలు ఉదాహరణ అన్నారు. ఇందులో పట్టణ నాయకులు లాలామున్నా, అంకత్ రమేష్, గందె కృష్ణ, ఆకుల ప్రవీన్, జోగు రవి, సోమ రవి, షెకావత్, కృష్ణయాదవ్, వ్యాస్, ధోనిజ్యోతి, రాజేశ్, శ్రీనివాస్, శివ, రఘుపతి, సతీష్, భీమ్‌సేన్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉట్నూర్: బీజేపీ ఆవిర్భవించి 44ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఉట్నూర్‌లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాథోడ్ రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరిరమేష్, జాతీయ నాయకులు శ్రీరామ్‌నాయక్, మండల అధ్యక్షుడు కొలిపాక రాజశేఖర్, కోకన్వీనర్ గడ్డంనందిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బింగి వెంకటేశ్, సాడిగే రాజేశ్వర్, యువ మోర్చ జిల్లా కార్యదర్శి బొడ్డుకిరణ్, తస్నీరు, సతీష్, రమణ, శ్రీకాంత్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం సందర్భంగా మండలంలోని అన్ని పోలింగ్ బూతుల పరిధిలో కార్యకర్తలతో, ప్రజలతో కలిసి జాతర్ల గ్రామంలో టిఫిన్ బైటక్ కార్యక్రమంలో బీజేపీ ఆదిలాబాదు పార్లమెంటు అభ్యర్థి గోడం నగేష్ పాల్గొన్నారు. గ్రామంలో కార్యకర్తలతో, గ్రామస్థులతో కలిసి పార్టీ జెండాను ఆవిశ్కరించారు. అనంతరం భూతాం గ్రామంలో నిర్మించిన మమదేవుని ఆలయంలో నూతన విగ్రహ స్థాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బత్తిని సుధాకర్, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ గజానంద్, ఎంపీటీసీ పెందుర్ ఈశ్వర్, పీఏసీఎస్ చైర్మన్ మేకల వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ సంతోష్, మాజీ జడ్పీటీసీ కొత్త శంకర్, చట్ల ఉత్తం, నానం రమణ, అల్కె గణేష్, తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గుడిహత్నూర్ మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ బీజేపీ జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడతూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఏ ఉద్దేశంతో పార్టీని స్థాపించారో ఆయన ఆశయాలకు అనుగుణంగానే నేడు ప్రధాని నరేంద్రమోదీ ముందుకు తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు. దేశం కోసం, ధర్మం కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రధాని కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కేంద్రే లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్, కార్యకర్తలు

ఇచ్చోడ: మండలవ్యాప్తంగా శవారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్చోడ మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం టిఫిన్ బైటాక్ కార్యక్రమం నిర్వహిచారు. ఇందులో మండల అధ్యక్షుడు నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు రవి, రాము, పాండురంగ్, దయాకర్ తులసీరాం, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు అరెల్లి రాజలింగం ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యాలయ ఆవరణలో బీజేపీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుష్పలత, దేవపూజ్ మారుతి, జైస్వాల్, శివకుమార్, దీపక్‌సింగ్, షేకావత్, కనక తుకారం, మరప రాజు, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని 35 పోలింగ్ బూత్ కేంద్రాలలో పార్టీ జెండాను పోలింగ్ బూత్ అధ్యక్షుడు ఆవిష్కరించారు. అనంతరం అక్కడే టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించారు. మండలకేంద్రంలో జెండా విష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మండల ప్రధాన కార్యదర్శి సాబ్లె సంతోష్‌సింగ్ మాట్లాడారు.

బోథ్: బీజేపీ 44 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల కేంద్రంలో శనివారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు బారే భోజన, ఓబీసీ నియోజకవర్గ అధ్యక్షుడు తూము సూర్యం, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ బోరే రవీందర్‌తో పాటు చిటికేసి వెంకటేష్, సుభాష్, సూర్యతో పాటు వివిధ గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని పొచ్చెర గ్రామంలో పార్టీ నాయకులు చిలుకూరి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడులను జరుపుకున్నారు.

తాంసి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో పార్టీ కార్యాలయాల ఆవరణల ముందు బీజేపీ జెండాను ఎగురవేశారు. అనంతరం స్వీట్లు, పండ్లు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి, నాయకులు స్వామి, అరుణ్ కుమార్, విలాస్, తదితరులు పాల్గొన్నారు.



జాతర్లలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ అభ్యర్థి గేడం నగేష్



ఉట్నూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేష్



గుడిహత్నూర్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు పతంగే

తలమడుగు: బీజేపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని శనివారం మండలంలోని సుంకిడి, దేవాపూర్, బరంపూర్, ఝరి కుచ్లాపూర్, సాయిలింగి తదితర గ్రామాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇందులో పార్టీ సీనియర్ నాయకులు చంద్రకాంత్, మహేందర్‌యాదవ్, జక్కుల ప్రభాకర్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా అంతటా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



నిర్మల్ జిల్లా కేంద్రంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ మున్సిపల్ కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 6 : నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శనివారం తన నివాసంలో నిర్వహించిన బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్నారు. పార్టీ పతాకావిష్కరణ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన టిఫిక్ బైఠక్‌లో పాల్గొన్నారు. దేశంలో బీజేపీ నిర్ణయాత్మక శక్తిగా ఎదుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగిస్తుందని, మోదీ మూడోసారి ప్రధానిగా కావడం తధ్యమన్నారు. నాయకులు రాంనాథ్, మేడిసెమ్మె రాజు, నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, సాదం అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లా కేంద్రం నాయుడివాడ శివాజీ విగ్రహ వద్ద శనివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్ ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం టిఫిన్ బైఠక్ నిర్వహించారు. 1980 ఏప్రిల్ 6న ఆవిర్భవించిన బీజేపీ అంచెలంచెలుగా ఎదిగిందని సాధం అరవింద్ అన్నారు.అసెంబ్లీ కన్వీనర్ గాదేవిలాస్, నాయకులు భరత్‌కుమార్, దివాకర్, ప్రవీణ్, సత్యేందర్, ఎస్. రాకేష్, తదితర నాయకులు పాల్గొ న్నారు.



ఖానాపూర్ ఎన్టీఆర్ చౌక్‌లో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పట్టణ అధ్యక్షులు సంతోష్

దిలావర్‌పూర్ : భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని ఆ పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బీజేపీ జెండాను ఎగురవేశారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు శైలేశ్వర్ జెండా ఎగురవేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్, డి. ముత్యం రెడ్డి, వీరేష్ కుమార్, సాయినాథ్, కోడె ముత్యం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్ : భారతీయ జనతాపార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఖానాపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు నాయిని సంతోష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌక్, తెలంగాణ చౌక్‌లలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, బీజేపీ సీనియర్ నాయకులు అజ్మీరా హరినాయక్ హాజరై రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలోని అన్ని బూత్‌లలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని పట్టణ ప్రధాన కార్యదర్శులు దాసరి శ్రీనివాస్, కొండవేని రమేష్‌లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దాదే మల్లయ్య, మంత్రరాజం సురేష్, బెజ్జారపు రాజేశ్వర్, నల్ల రవీందర్‌రెడ్డి, మట్టేరి రాజశేఖర్, అనిల్ రావ్ తదితరులున్నారు.

భైంసా : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసాలో శనివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నాయి.



భైంసాలో జరిగిన బీజేపీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాంరావ్ పటేల్ తదితరులు

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో జరిగిన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పటేల్, పార్టీ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్‌లు బీజేపీ జెండాను ఎగురవేసారు.

భైంసా రూరల్ : మండలంలోని దేగాం గ్రామంలో శనివారం బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భైంసా మండల మహిళా మోర్చా అధ్యక్షులు సీరం సుష్మరెడ్డి బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బీజేపీ హయాంలో దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ నాయకత్వంలో పార్లమెంట్ ఎన్నికల్లో తమ సత్తా చాటుతామన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సుభాష్ పటేల్, నాయకులు చంద్రకాంత్ పటేల్, కిష్టయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు



దిలావర్‌పూర్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తున్న కార్యకర్తలు



దేగాంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న దృశ్యం



ఇచ్చోడలో సమావేశానికి హాజరైన ఉద్యోగులు



తాంసిలో మాట్లాడుతున్న ఎంపీడీవో మోహన్‌రెడ్డి



జైనథ్‌లో పాల్గొన్న హెచ్‌ఎంలు, వీవో లీడర్లు, తదితరులు

ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలి

● ఇచ్చోడ ఎంఈవో ఉదయ్‌రావు, ఎంపీడీవు లక్ష్మణ్ ● ఆయా మండలాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల సమావేశం ● పాల్గొన్న వివిధ శాఖల అధికారులు


ఇచ్చోడ, ఏప్రిల్ 6: అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని మండల విద్యాధికారి ఉదయ్‌రావు, ఎంపీడీవు లక్ష్మణ్‌లు అన్నారు. శనివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యలయంలో ఎంపీఓ, ఎంపీడీఓ, ఎంఈఓలతో కలిసి నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అవసరం ఉన్న చోట బాలికలకు మూత్రశాలలు నిర్మించాలని, విద్యుత్తు వసతి కల్పించాలని ఉపాధ్యాయుకు సూచించారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పనులు పూర్తిచేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి పాఠశాల కమిటీ పేరిట బ్యాంకు ఖాతా తెరవాలన్నారు. ఇంజనీరింగ్ విభాగం అధికారులు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి అభివృద్ధి పనుల అంచనా ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలన్నారు.

● పాఠశాల నిర్వహణ పటిష్ఠంగా చేపట్టాలి : ఎంపీడీవో

తాంసి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వహణ కార్యక్రమాన్ని పటిష్ఠంగా చేపట్టాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అమ్మ ఆదర్శ పాఠశాల వర్క్ షాప్ కార్యక్రమాన్ని ఏర్పా టు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు, గ్రామాల కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి అధికారి ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని ముందుకు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో లోపలు జరిగినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, పంచాయితీ రాజ్ ఈఈ శివరాం రాథోడ్, తహసీల్దార్ సంధ్యారాణి, తదితరులు ఉన్నారు.

● మౌలిక పనులను జూలైలోగా పూర్తి చేయాలి

జైనథ్ రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో యూడైస్ ఆధారంగా పొందుపరిచిన మౌలిక వసతులు వాటి పనులను జూలైలోగా పూర్తి చేయాలని ఎంఈవో గంగుల శ్రీనివాస్, ఎంపీడీవో రవీంద్రనాథ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల రైతువేదిక సమావేశంలో ఏర్పాటు చేసి అమ్మ ఆదర్శ పాఠశాలల హెచ్‌ఎంలు, వీవో లీడర్ల సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.





అభ్యర్థులకు.. టికెట్ టెన్షన్!

- జిల్లాలో రహస్యంగా సర్వేలు నిర్వహిస్తున్న ప్రధాన పార్టీలు
- అభ్యర్థులను ప్రకటించినా.. టికెట్‌పై అనుమానాలు
- ఇంకా ధీమాతోనే కనిపిస్తున్న ఆశావహ నేతలు
- ప్రచారానికి అంటీముట్టనట్లుగా ఉంటున్న సీనియర్లు
- అభ్యర్థుల ఖరారుపై ఇప్పటికీ భిన్నాభిప్రాయాలే..

ఆదిలాబాద్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారైనా ఇంకా వారిని టికెట్ టెన్షన్ వెంటాడుతూనే ఉంది. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థుల నిర్ణయంపై రకరకాల ప్రచారం జరగడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అభ్యర్థులు ప్రచారంలో ఓ అడుగు ముందుకేస్తున్నా.. రెండడుగులు వెనక్కి వేసినట్లుగానే కనిపిస్తుంది. టికెట్ చేతికొచ్చే వరకు రాజకీయాలు ఎప్పుడు? ఎలా? మలుపులు తిరుగుతాయో చెప్పలేమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే గడిచిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో బోథ్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ మొదట డాక్టర్ వన్నెల అశోక్‌ను ప్రకటించి.. ఆ తర్వాత 24 గంటల్లోనే ఆడే గజేందర్ పేరును అధికారికంగా ప్రకటించడం ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రధానంగా కాంగ్రెస్‌లో ఎప్పుడు ఏం జరుగుతుందో? చెప్పలేని పరిస్థితులు ఉంటాయని ఆ పార్టీ నేతలే అభిప్రాయపడుతున్నారు. అలాగే ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో లంబాడా సామాజికవర్గానికి చెందిన నేతల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దీంతో ప్రధాన పార్టీల అధిష్ఠానం పెద్దలపై ఒత్తిళ్లు పెరుగుతున్నట్లు తెలుస్తుంది. అన్ని పార్టీలలో అభ్యర్థులకు వ్యతిరేకంగా ఆశావహ నేతలు చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన అభ్యర్థులు పార్టీలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తుంది. అయితే అభ్యర్థులను ప్రకటించి దాదాపు నెల రోజులు గడుస్తున్నా.. ఇంకా భిన్నాభిప్రాయాలే వ్యక్తం కావడం పలురకాల అనుమానాలకు దారి తీస్తోంది.



కుదరని ఏకాభిప్రాయం

అభ్యర్థుల ప్రకటనపై అన్ని పార్టీలలో ఏకాభిప్రాయం కుదిరినట్లు కనిపించడం లేదు. ఎందుకంటే సొంత పార్టీ నేతలను పక్కనపెట్టి కొత్త వారికి అవకాశం ఇవ్వడంతో మరిన్ని విభేదాలకు దారి తీస్తోంది. బీజేపీకి సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు అందుబాటులో ఉండగా.. అయనను పక్కనపెట్టి కొత్తగా పార్టీలో చేరిన వలస నేత గోడం నగేష్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించడం ఆ పార్టీలో వ్యతిరేకతకు ప్రధాన కారణమవుతోంది. పార్టీ అధికారంలో లేకపోయినా.. పార్టీ కోసమే పని చేసిన నేతలను కాదని కాంగ్రెస్ ఆదివాసీ ఉపాధ్యాయురాలు ఆత్రం సుగుణను అభ్యర్థిగా ప్రకటించడంతో సీనియర్ నేతలు ఆగ్రహంతో ఊగిపోతున్నట్లు తెలుస్తుంది. గతంలో ఇచ్చిన హామీ ప్రకారమే బీఆర్ఎస్ ఆత్రం సక్కును పార్టీ అభ్యర్థిగా నిర్ణయించినా.. సామాజిక సమీకరణల్లో భాగంగా త్వరలోనే అభ్యర్థి మార్పు ఉంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. బీఆర్ఎస్‌లో ఆశావహ నేతలు పెద్దగా లేకపోయినా.. గెలిచేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. అభ్యర్థుల ఎంపికపై ప్రధాన పార్టీలలో ఇప్పటికీ ఏకాభిప్రాయం కుదిరినట్లు కనిపించడం లేదు. దీంతో అధిష్ఠానం పెద్దలకు నేతలు పోటాపోటీగా ఫిర్యాదులు చేసుకోవడం తలనొప్పిగా మారిందంటున్నారు.

వేచిచూసే ధోరణిలో నేతలు

ఆశావహ నేతలను పక్కనపెట్టి అభ్యర్థులను ప్రకటించినా.. ఇంకా కొందరు నేతలు వేచిచూసే ధోరణితోనే కనిపిస్తున్నారు. ఎందుకంటే టికెట్ చేతికి వచ్చేవరకు ఇంకా సమయం ఉందంటూ ధీమాతో చెబుతున్నారు. రాజకీయ పరిస్థితులు తారుమారయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. చివరికి తామే ఎన్నికల బరిలో ఉంటామంటూ బహిరంగంగానే ప్రచారం చేసుకుంటున్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు తాను లోక్‌సభ ఎన్నికల బరిలో ఉండడం ఖాయమని ప్రకటించుకున్నారు. పార్టీలో చేరే సమయంలోనే ఎంపీగా అవకాశం ఇస్తామని పార్టీ పెద్దలు చెప్పడంతో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇంకా ఆశగా ఎదురుచూస్తున్నారు. పార్టీలో తమకున్న పరిచయాలు, పలుకుబడితో టికెట్‌ను దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత మార్చిన దాఖలాలు కూడా ఉన్నాయని ధీమాతో చెబుతున్నారు. అయితే ప్రధాన పార్టీలో ముఖ్యనేతల మధ్య సఖ్యత లేకపోవడంతో పార్టీ శ్రేణులు అయోమయానికి గురవుతున్నారు. ఎవరికి జై కొడితే ఏమవుతుందోనన్న భయాందోళనకు గురవుతున్నారు. చివరకు ఎవరు ఎన్నికల బరిలో ఉంటారో ఇప్పుడే చెప్పలేని పరిస్థితులు ఉన్నాయంటూ చెబుతున్నారు.

ప్రచారానికి దూరమే..

పార్టీ అభ్యర్థులను ప్రకటించిన సీనియర్లు, ముఖ్యనేతలంతా ప్రచారానికి దూరంగానే ఉంటున్నారు. అభ్యర్థులే ఒంటరిగా నియోజకవర్గాలను చుట్టేస్తూ ముఖ్యనేతలను కలుస్తూ మద్దతునివ్వాలని కోరుతున్నారు. కానీ టికెట్‌ను ఆశించిన ఆశావహ నేతలెవరూ అభ్యర్థుల వెంట కనిపించడం లేదు. పార్టీ ఆదేశించడంతోనే పోటీ చేయాల్సి వస్తుందని అభ్యర్థులు బుజ్జగించే ప్రయత్నం చేస్తున్న అసమ్మతి నేతలు వెనక్కి తగ్గినట్లు కనిపించడం లేదు. తమను కాదని పార్టీ అభ్యర్థులు ఎలా గెలుస్తారో? చూస్తామంటూ సన్నిహితుల వద్ద సవాల్ విసురుతున్నారు. ఇప్పటికే అధిష్ఠానం పెద్దలు నచ్చచెప్పే ప్రయత్నం చేయడంతో కొంత సైలెంట్‌గానే కనిపిస్తున్నా.. లోలోన మాత్రం పార్టీ నిర్ణయంపై రగిలి పోతున్నట్లు తెలుస్తుంది. పార్టీ అభ్యర్థులు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భాలలో సరేనని చెబుతున్నా.. ఆ తర్వాత తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటంటూ అధిష్ఠానం పెద్దలను ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఇతర ముఖ్య నేతలు పార్టీ అభ్యర్థితో కలిసి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ పార్టీలలో దీనికి భిన్నమైన పరిస్థితులే కనిపిస్తున్నాయి. సోషల్ మీడియాలోనూ రోజుకో రకమైన ప్రచారం జరుగడంతో అన్ని పార్టీలలో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



హాజరు రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి

హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఆకస్మిక తనిఖీ

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 6: మండలంలోని ఈశ్వర్‌నగర్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ కుడ్మెత మనోహర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీ వైద్య సిబ్బంది హాజరు రిజిష్టర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. పేద ప్రజలకు నమ్మకం కలిగించేలా నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, సీహెచ్‌వో సందీప్, హెచ్‌ఈవో తులసీదాస్, పీహెచ్‌ఎన్ జ్యోతి, హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ పూజ, ఏఎన్‌ఎం సేవంతా, ఆశా వర్కర్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.



రైతుదీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

రైతుబంధు అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ మంత్రి జోగు రామన్న
- హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 6: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన రైతుబంధు పథకం అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆరోపించారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని రైతుదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ రైతుల సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బూటకపు హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతుబంధు నగదును రైతుల ఖాతాల్లో ఇప్పటికీ జమ చేయడం లేదని, రైతు కూలీలకు ఆర్థిక సహాయం హామీ సంగతేంటని ప్రశ్నించారు. పుష్కలంగా సాగునీరు ఉన్నప్పటికీ.. వాటిని సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో దాదాపు 20వేల ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టపోయిన రైతుల్లో ధైర్యం నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించిన సమయంలో సాగునీరు సరఫరా చేయడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయని పక్షంలో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపట్టి రైతులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేం దర్, ఎంపీపీలు మార్శెట్టి గోవర్ధన్, గండ్రత్ రమేష్, నేతలు యూనుస్ అక్బాని, అలాల్ అజయ్, యాసం నర్సింగ్‌రావు, రోకండ్ల రమేష్, మెట్టు ప్రహ్లాద్, నారాయణ, వేణుగోపాల్ యాదవ్, స్వరూప రాణి, మమత, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



తాళం వేసి ఉన్న కమాట్‌వాడ పాఠశాల

సారూ.. బడికి ఎప్పుడు వస్తారు!?

భీంపూర్, ఏప్రిల్ 6: మండలంలోని కమట్‌వాడ ప్రాథమిక పాఠశాలలో విద్యా బోధన సరిగ్గా లేదని స్థానికులు చెబుతున్నారు. 'సారూ బడికి ఎప్పుడు వస్తారంటూ?' గ్రామస్థులు, విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఈ గ్రామాన్ని 'ఆంధ్రజ్యోతి' సందర్శించింది. ఉదయం 9.30 గంటలకు కూడా కమాట్‌వాడ పాఠశాల తాళం వేసే ఉంది. వేసవిలో అన్ని బడులు ఉదయం 8 గంటలకే పని వేళ ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ పాఠశాలలో ఉదయం 9.30 గంటలకు కూడా ఉపాధ్యాయులు పాఠశాలకు రాలేదు. ఎలాగూ సారు రారు అని పిల్లలు కూడా భావించి బడికి రాకపోవడం గమనార్హం. ఇలాంటి బడులపై ఉన్నత అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉంది.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

'జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి'

బోథ్, ఏప్రిల్ 6: రైతులు పండించిన జొన్న, మొక్కజొన్న పంటలను మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బోథ్ తహసీల్దార్‌కు బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. రైతులు పండించిన జొన్న పంటను ఎకరానికి 8 క్వింటాళ్లు, 85 రోజులు మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించడం సరైంది కాదని, ఈ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పంట కొనుగోలుపై పరిమితి ఎత్తివేయాలని లేకుండా రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోవాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. మొక్కజొన్న పంటను సైతం ప్రభుత్వం కొనుగోలు చేపట్టాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇందులో ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల సుభాష్, నరేందర్, భీమా బుచ్చన్న, రమణగౌడ్, దేవిదాస్, ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
ఇఫ్తార్	సహర్
సా.6.35	ఉ.4.42



అల్లాహ్ ఒక దాసుడిని తన ప్రియతమునిగా చేసుకున్నప్పుడు.. అతనికి మృదుస్వభావాన్ని ప్రసాదిస్తాడు.

18 ఏళ్లు నిండిన వారు..

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ రాజార్షిషా
- స్వీప్ కార్యక్రమంలో భాగంగా భారీ ర్యాలీ
- పాల్గొన్న అధికారులు, మెడికోలు, క్రీడాకారులు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 6: 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒకరూ ఈనెల 14లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. శనివారం స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి జిల్లా పరిషత్ సమావేశ మందిరం వరకు నిర్వహించిన ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఆయన కాగడాను వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ అవగాహనపై జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ నెల14 వరకు ఓటరుగా నమోదుకు అవకాశం ఉన్నందున అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఫాం నెంబర్-6 నింపి సంబంధిత బూత్‌లెవల్ అధికారులకు కొత్తగా ఓటరు నమోదు కోసం ఇవ్వాలన్నారు. అంతేకాకుండా ఆన్‌లైన్ దరఖాస్తు యాప్‌లో తమ ఆధార్‌కార్డు లేదా ఎస్ఎస్‌సీ మార్కుల మెమో ఆధారంగా కొత్త ఓటర్ల కోసం చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో పాల్గొని తమ ఓటును, తమ కుటుంబ సభ్యుల ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న వారితో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఇందులో అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి, డీఎస్పీ, డీవైఎస్‌వో, డీఎంహెచ్‌వో, రిమ్స్ డైరెక్టర్, డీడబ్ల్యూవో, ఆర్డీవో, మున్సిపల్ కమిసనర్, అర్బన్, రూరల్ తహసీల్దార్లు, మావల మండల అధికారులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మెడికోలు, పీడీ మెప్మా, ఆర్పీఎస్‌లు, సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మెంబర్లు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



కాగడ వెలిగిస్తున్న జిల్లా కలెక్టర్ రాజార్షి షా



ఓటర్ నమోదుపై మాట్లాడుతున్న కలెక్టర్



పాల్గొన్న అధికారులు, అంగన్‌వాడీ, ఆశాలు

కుటుంబ సర్వే వివరాలు పకడ్బందీగా చేపట్టాలి

- సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 6: కుటుంబ సర్వే వివరాలను అంగన్‌వాడీ టీచర్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజార్షిషా అన్నారు. పోషన్ అభియాన్‌పై మహిళా శిశు సంక్షేమ శాఖ డీడబ్ల్యూవో, సీడీపీవో, ఏసీడీపీవో, సూపర్‌వైజర్లతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ల ద్వారా కుటుంబ సర్వే, రిజిష్టర్‌లు మెయింటెన్, బరువు తక్కువగా ఉన్న పిల్లలను రిమ్స్, ఉట్నూర్ సీహెచ్‌సీలోని ఎన్ఆర్‌సీ ఎస్ఎన్‌సీయూ రిఫర్, ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న బియ్యం బయోమెట్రిక్, గ్రోత్ మానిటరింగ్, టీహెచ్ఆర్ అప్ డేట్, తదితర అంశాలపై సీడీపీవో, సూపర్‌వైజర్లను మండలాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న బియ్యానికి సంబంధంచిన బయోమెట్రిక్ వేసిన తర్వాత వారంలోగా ఏజెన్సీ వారు కేంద్రాలకు సరఫరా కావాలని ఆదేశించారు. సంవత్సరానికి ఒకసారి నిర్వహించే కుటుంబ సర్వేలో అన్ని వివరాలతో పకడ్బం దీగా చేపట్టాలని, బాలామృతమ్, కోడిగుడ్లు అందిస్తున్న వివరాలు టీహెచ్ఆర్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ప్రతీనెల మొదటి వారంలో గ్రోత్ మానటరింగ్ జరగా లని, గ్రోత్ మిషిన్స్ చెడిపోతే వాటి వివరాలు సమర్పించాలని తెలిపారు. శ్యామ్ మామ్ పిల్లలను గుర్తించి ఆర్‌బీఎస్‌కే టీంతో సమన్వయం చేసుకొని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, రిమ్స్‌కి పంపించాలని 14రోజుల పాటు వైద్యాధికారుల పర్యవేక్షణలో ఉంచి పౌష్టికాహారం అందించాలని, మండలాల్లోని హాబిటేషన్ వారీగా అంగన్‌వాడీ టీచర్లు తక్కువ బరువు ఉన్న పిల్లల వివరాలు సేకరించి అవసరమైన ట్రీట్‌మెంట్ చేయించాలని తెలిపారు. ప్రతీ మొదటి బుధవారం విలేజ్ లెవల్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ డేను నిర్వహించి వివరాలు తెలపాలని సూచించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు నిర్వహించాలని, స్పాట్ ఫీడింగ్, గర్భిణులు, బాలింతలు పిల్లలకు 11గంటలలోపు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆశా వర్కర్ల వద్ద 200 పైగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉండాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందు న మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని, తల్లులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ వికాస్‌మహాతో, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

'నివేదికలను త్వరగా సమర్పించాలి'

ఆదిలాబాద్ అర్బన్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన సదుపాయాలను క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి ఫైనల్ ఎస్టిమేషన్ నివేదికలు త్వరగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, ట్రైనీ కలెక్టర్ వికాస్‌మహాతో, ఈఈ, పీఆర్, ఈఈ ఆర్అండ్‌బీ, ఎంఈఎయూడీ, ఆర్‌డబ్ల్యూస్, ఈడబ్ల్యూఐడీసీ, డీఈవో అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మౌలిక వసతులు అవసరమైన పాఠశాలలను సందర్శించి నిర్వహించాల్సిన పనుల ఫైనల్ ఎస్టిమేషన్‌ను రూపొందించి వెంటనే పంపాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.